క్లుప్తంగా

క్రీడలతో మానసికోల్లాసం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న విజయ్‌యాదవ్

కోడుమూరు రూరల్: క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి విజయ్‌యాదవ్ అన్నారు. మండలంలోని ప్యాలకుర్తి గ్రామంలో క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను ఆయన ప్రారంభించారు. కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్ సహాయ సహకారాలతో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో మొదటి బహుమతిగా రూ.30వేలు, రెండో బహుమతిగా రూ.15 వేలు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు మదన్‌గోపాల్, మాదన్న, మిన్నెల్ల తదితరులు పాల్గొన్నారు.

'ఆడుదాం ఆంధ్రా' పోటీలకు సర్వం సిద్ధం



పాణ్యంలో సిద్ధమవుతున్న మైదానం

పాణ్యం: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న "ఆడుదాం..ఆంధ్రా" క్రీడా పోటీలకు క్రీడా మైదానాన్ని సిద్ధం చేశారు. మంగళవారం ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభం కానున్నాయి. ఆయా సచివాలయాల పరిధిలో సర్పంచ్‌లు, ప్రజా ప్రతినిధులు, క్రీడాకారులు, అధికారులు పాల్గొననున్నారు. కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్, వాలీబాల్, క్రికెట్ పోటీలకు పాణ్యం మండలంలో మొత్తం 4,268 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఇందులో స్త్రీలు 1,123, పురుషులు 3,145 మంది ఉన్నారు.

క్రికెట్ విజేత ఓర్వకల్లు

ఓర్వకల్లు: ఓర్వకల్లులో సోమవారం నిర్వహించిన గ్రామ స్థాయి క్రికెట్ పోటీల్లో స్థానిక బస్టాండ్ జట్టు ప్రథమ స్థానం దక్కించుకున్నట్లు ఆర్గనైజర్ రాజేష్ తెలిపారు. క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ఆర్‌సీఎం చర్చి సంఘస్తుల సౌజన్యంతో నిర్వహించిన పోటీల్లో ప్రథమ స్థానం సాధించిన జట్టుకు రూ.5 వేలు, ద్వితీయ స్థానం మర్రిచెట్టు జట్టుకు రూ.3 వేలు, తృతీయ స్థానంలో నిలిచిన మోడల్ స్కూల్ జట్టుకు రూ.2 వేల చొప్పున బహుమతులు ప్రదానం చేసినట్లు వెల్లడించారు.

నేటి నుంచి వికసిత్ భారత్

సి.బెళగల్: మండలంలో మంగళవారం నుంచి వికసిత్ భారత్ సంకల్ప యాత్ర ప్రారంభమవుతుందని ఈఓఆర్డీ సందీప్ సోమవారం తెలిపారు. వచ్చే నెల జనవరి 3వ తేదీ వరకు మండలంలో కొనసాగుతుందన్నారు. ప్రతి రోజు రెండు గ్రామ పంచాయతీల్లో కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. మొదటి రోజు మండల పరిధిలోని పోలకల్ గ్రామంలో ఉదయం 10 గంటలకు, బ్రాహ్మణదొడ్డి గ్రామ పంచాయతీలో మధ్యాహ్నం 3 గంటలకు వికసిత్ భారత్ కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు.

నేటి నుంచి ఆడుదాం ఆంధ్రా పోటీలు


కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని నందనపల్లె గ్రామంలో ఆడుదాం ఆంధ్రా క్రీడా పోటీలను కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ ప్రారంభించనున్నారు. మొదటి రోజు నందనపల్లెలో బ్యాడ్మింటన్ పోటీలు నిర్వహించనున్నారు.

● **సి.బెళగల్:** స్థానిక బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల, జెడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానాల్లో పోటీలు జరుగుతాయని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. మండల, గ్రామ స్థాయి అధికారులు సమన్వయంతో వ్యవహరించి క్రీడలను పకడ్బందీగా నిర్వహించాలన్నారు.

● **గూడూరు:** పట్టణంలోని జెడ్పీ హైస్కూల్ ఆవరణలో జరిగే పోటీలను ఎమ్మెల్యే సుధాకర్ ప్రారంభిస్తారని మున్సిపల్ కమిషనర్ ప్రసాద్ గౌడ్ తెలిపారు.

● **కర్నూలు (న్యూటౌన్):** కల్లూరు మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో ఆడుదాం ఆంధ్రా టోర్నమెంట్ ప్రారంభమవుతుందని, ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు విజయవంతం చేయాలని ఎంపీడీఓ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు.

వాజ్‌పేయికి ఘన నివాళి



జయంతి కార్యక్రమంలో బీజేపీ నాయకులు

కర్నూలు (న్యూటౌన్): నీతి, నిజాయితీకి మారుపేరు మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారీ వాజ్‌పేయి అని బీజేపీ నంద్యాల జిల్లా అధికార ప్రతినిధి చెన్నయ్య, బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు తారకేశ్వర్‌రెడ్డి అన్నారు. సోమవారం కల్లూరు చెన్నమ్మ సర్కిల్‌లో మాజీ ప్రధాని అటల్‌బిహారీ వాజ్‌పేయి జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆ పార్టీ పాణ్యం కన్వీనర్ బైరెడ్డి నవీన్, జిల్లా కార్యదర్శి శ్రీజ్యోతి, నాయకులు గంగాధర్, రామ్మోహన్‌రెడ్డి, ఎన్వీ రావు, ప్రతాప్‌రెడ్డి, బాబ్‌జాన్ పాల్గొన్నారు.

● మండలంలోని గొల్లలదొడ్డిలో ఉప్పర లత అనే మహిళా రైతు 4 ఎకరాలను కౌలుకు తీసుకుని వ్యవసాయం చేస్తున్నారు. ఆ భూమి వివరాలు యాజమాని పేరిట ఉండటంతో పంట సాగుకు ప్రభుత్వం అందించే పథకాలు, సాయం అందేవి కావు. పంట దిగుబడిని సైతం వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సి వచ్చేది. వలంటీర్ల ద్వారా కౌలు హక్కు కార్డు గురించి తెలుసుకుని సచివాలయాల ఉద్యోగుల సహాయంతో వివరాలను నమోదు చేసుకుంది. కౌలు కార్డు మంజూరు కావడంతో ఒక్క ఏడాదిలో వైఎస్సార్ రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 పెట్టుబడి సాయం, పంట బీమా ద్వారా రూ.18,404 ఆర్థిక సాయం అందింది.



● బురాన్‌దొడ్డి గ్రామానికి చెందిన ప్రహ్లాద రెండెకరాలను కౌలుకు తీసుకుని సాగు చేసుకుంటున్నాడు. గతంలో కౌలు కార్డు లేకపోవడంతో సొంతంగా పెట్టుబడులు పెట్టుకుని తర్వాత పంట నష్టం వచ్చినా, గిట్టుబాటు ధర లేకపోయినా ఆర్థికంగా నష్టపోయేవారు. వలంటీర్ ద్వారా కౌలు హక్కు కార్డుకు దరఖాస్తు చేసుకోవడంతో గ్రామంలో జరిగిన జగనన్న సురక్ష సదస్సులో మండలాధికారులు వెంటనే సీసీఆర్ కార్డును అందజేశారు. కార్డు ద్వారా సబ్సిడీపై కంది విత్తనాలు, ఎరువులు, మందులు, రైతు భరోసా ఆర్థిక సాయం రూ.13,500 లబ్ధి చేకూరింది. ప్రస్తుత సీజన్‌లో వర్షాభావం వల్ల పంట దెబ్బతినడంతో పరిహారం కోసం అర్హుల జాబితాలో ఆయన వివరాలు నమోదయ్యాయి. త్వరలో పంట నష్టపరిహారం అందనుంది.



కౌలు రైతులకు అండగా ప్రభుత్వం

- సీసీఆర్ కార్డుతో బహుళ ప్రయోజనాలు
- బీమా, పంటనష్టం, సబ్సిడీ వర్తింపు
- కౌలు గుర్తింపు కార్డులను అందుకున్న 442 మంది రైతులు



క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డు



సి.బెళగల్‌లో రైతులకు సీసీఆర్సీలను అందజేస్తున్న సచివాలయ ఉద్యోగులు (ఫైల్)

సి.బెళగల్: రైతుల సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో రైతు భరోసా కేంద్రాలను (ఆర్బీకేలను) ఏర్పాటు చేసింది. వీటి ద్వారా రైతులకు విత్తనం మొదలుకుని దిగుబడులను గిట్టుబాటు ధరకు అమ్ముకునే వరకు ప్రతి దశలో అండగా నిలుస్తున్నారు. అలాగే పొలాలను కౌలుకు సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్న రైతుల సంక్షేమంపై దృష్టి పెట్టారు. ఆర్బీకేల ద్వారా కౌలు రైతులకు క్రాప్ కల్టివేషన్ రైట్స్ కార్డు (సీసీఆర్సీ)లను మంజూరు చేసి వారికి అండగా నిలుస్తున్నారు. గ్రామాలలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా సదస్సులను నిర్వహించిన అధికారులు, వ్యవసాయ భూములను కౌలుకు సాగు చేసుకునే రైతులను గుర్తించి సీసీఆర్సీలను అందజేశారు. ఈ కార్డుల ద్వారా కౌలు రైతులు బహుళ ప్రయోజనాలను పొందుతున్నారు.

రూ.3.48 కోట్లతో ఆర్బీకేల అభివృద్ధి

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం పల్లెల్లో ప్రతిష్టాత్మకంగా ఆర్బీకేల నిర్మాణానికి తగిన మొత్తంలో నిధులు కేటాయించింది. దీంతో మండలవ్యాప్తంగా ఉన్న 16 గ్రామాలలో నూతన రైతు భరోసా కేంద్రాల నిర్మాణాలు ప్రారంభమయ్యాయి. దాదాపు రూ.3.48 కోట్లతో ఆర్బీకేల నిర్మాణాలు జరిగాయి. వీటిలో ఇప్పటికే మూడు ఆర్బీకేల నిర్మాణాలు పూర్తికాగా, మరో 8 భవనాలు త్వరలో ప్రారంభం కానున్నాయి. మిగతా ఐదు వివిధ స్థాయిలలో నిర్మాణాలు జరుగుతున్నాయి. ఆర్బీకేల ద్వారా రైతులు, వ్యవసాయ రంగం అభివృద్ధికి ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుంది.

సీసీఆర్సీలతో ప్రయోజనాలు

పంట సాగు హక్కు పత్రాలతో (సీసీఆర్సీలతో) కౌలు రైతులకు బహుళ ప్రయోజనాలు ఉన్నాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హత పొందడంతో పాటు రైతు భరోసా ఆర్థిక సాయం, సబ్సిడీపై ఎరువులు, విత్తనాలు, మందులు, వ్యవసాయ యంత్రాలను పొందవచ్చు. పంటల బీమాతో పాటు పంటనష్ట పరిహారం హక్కులు వర్తిస్తాయి. వెబ్ ల్యాండ్ పోర్టల్‌తో సీసీఆర్సీల అనుసంధానంతో కౌలు కార్డులతో బ్యాంకుల ద్వారా రుణాలు పొందవచ్చు. ప్రభుత్వం చేపట్టే ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వ్యవసాయ ఉత్పత్తులను గిట్టుబాటు ధరకు అమ్ముకునేందుకు అవకాశం కలుగుతుంది.

442 మందికి కౌలు కార్డులు

మండలంలో జరిగిన జగనన్న సురక్ష కార్యక్రమంలో మండలవ్యాప్తంగా ఉన్న 16 ఆర్బీకేల పరిధిలో మొత్తం 442 మంది కౌలు రైతులకు ప్రభుత్వం సీసీఆర్సీలను మంజూరు చేసింది. ఆర్బీకేల వారిగా.. సి.బెళగల్ - 1, 2 ఆర్బీకేలో 62 మందికి కౌలు కార్డులు మంజూరు కాగా పోలకల్- 1, 2, 3 పరిధిలో 87 మందికి, కంబదహాల్‌లో 24 మంది, కొత్తకోట-1, 2 లలో 45 మంది, బ్రాహ్మణదొడ్డిలో 50 మంది, కొండాపురంలో 24, సంగాలలో 21, ఇనగండ్లలో 31, ముడుమాలలో 22, బురాన్‌దొడ్డి-1, 2లలో 44, చింతమానుపల్లెలో 32 మంది కౌలు కార్డులను అందుకున్నారు. కౌలు కార్డులను అందుకున్న రైతులు ప్రభుత్వ పథకాలకు అర్హులు కావడంతో ధీమా వ్యక్తం చేస్తున్నారు.

రైతుల్లో అవగాహన పెరిగింది



రైతులకు వ్యవసాయ సంక్షేమ పథకాలపై అవగాహన పెరిగింది. భూముల యజమానుల హక్కులకు ఎలాంటి భంగం వాటిల్లకుండా కౌలు హక్కు కార్డులు మంజూరు చేస్తుండడంతో కౌలుదారులు హక్కు కార్డులు పొందేందుకు భూయజమానులు స్వచ్ఛందంగా అనుమతిస్తున్నారు. మండలంలో పెద్ద ఎత్తున కౌలు రైతులు గుర్తింపు కార్డుల కోసం నమోదు చేసుకున్నారు. అర్హతను పరిశీలించి దరఖాస్తు చేసుకున్న వారందరికీ సీసీఆర్ కార్డులు మంజూరుచేస్తున్నాం. – మల్లేష్‌కుమార్, ఏఓ, సి.బెళగల్ మండలం

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మా కుటుంబం కౌలుకు భూమిని సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాం. గతంలో ఎలాంటి ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందేవి కాదు. కౌలు కార్డులతో మాలాంటి వాళ్లకు కూడా ప్రభుత్వ పథకాలు, నష్ట పరిహారం అందుతుందని, కార్డుకు నమోదు చేసుకుంటే వ్యయ ప్రయాసలు లేకుండా రోజుల వ్యవధిలోనే పొందవచ్చని సచివాలయ ఉద్యోగులు, వలంటీర్ల ద్వారా తెలుసుకుని అందుకు దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు ఉచితంగా కౌలు కార్డును ఇచ్చారు. ప్రభుత్వం నుంచి ఒక్క ఏడాదిలో రూ.31 వేలు ప్రభుత్వం సాయం పొందాను. ఇంత మేలు చేసిన ప్రభుత్వానికి రుణపడి ఉంటాం. – ఉప్పర లత, కౌలు రైతు, గొల్లలదొడ్డి గ్రామం

ఇంటి వద్దకే కౌలు కార్డు తెచ్చిచ్చారు

ప్రభుత్వ అధికారులు కౌలు కార్డు గురించి మాకు అవగాహన కల్పించి, కార్డులు పొందేందుకు అవకాశం కల్పించారు. నమోదు చేయించుకున్న తరువాత మంజూరైన సీసీఆర్ కార్డును అధికారులు ఇంటి వద్దకే తెచ్చి అందజేశారు. ఈ కార్డుతో పంట నమోదు చేయించడంతో పాటు రైతు భరోసా రూ.13,500 నా ఖాతాకు జమ అయ్యాయి. కౌలు కార్డు ఉండటంతో పంట నష్ట పరిహార జాబితాలో మా పేరు ఉంది. చాలా సంతోషంగా ఉంది. అధికారులకు, ప్రభుత్వానికి ధన్యవాదాలు. – ప్రహ్లాద, కౌలు రైతు, బురాన్‌దొడ్డి గ్రామం

క్రిస్మస్ వేడుకలు



కోడుమూరు: ఏబీఎం చర్చిలో ప్రార్థనలు

- వాడవాడలా క్రిస్మస్ సందడి
- చర్చిల్లో ప్రత్యేక ప్రార్థనలు
- బైబిల్ సారాంశాన్ని వివరించిన పాస్టర్లు

కర్నూలు (న్యూటౌన్): క్రిస్మస్ వేడుకలను సోమవారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. కల్లూరు మండల పరిధిలోని చెట్లమల్లాపురం, బస్తిపాడు, లక్ష్మీపురం చర్చిల్లో ఫాస్టర్లు క్రీస్తు జననం గురించి వివరించారు. చెట్లమల్లాపురంలోని ఆరాధన మందిరంలో క్రిస్మస్ వేడుకల్లో భాగంగా పాస్టర్ సుందర్‌పాల్ దైవ సందేశం వినిపించారు. క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. ఏసుక్రీస్తు మార్గం అనుసరణీయమని ప్రతి ఒక్కరూ ఆయన బాటలో నడవాలని సందేశమిచ్చారు.

● **ఓర్వకల్లు:** మండలంలో ప్రార్థన మందిరాల్లో క్రిస్మస్ సందర్భంగా క్రైస్తవులు నూతన వస్త్రాలను ధరించి కుటుంబ సమేతంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ప్రార్థన మందిరాలు క్రైస్తవ భక్తులతో కిటకిటలాడాయి. ఓర్వకల్లులోని ఏబీఎం చర్చిలో క్రైస్తవ గీతాలు ఆలపించగా, పాస్టర్ విజయకుమార్ బైబిల్ సందేశం వినిపించారు.

● **గడివేముల:** కరుణ, శాంతి, ప్రేమతో ప్రతి



గడివేముల: ఏబీఎం చర్చిలో..

ఒక్కరూ మెలగాలని పాస్టర్లు పేర్కొన్నారు. గడివేములలోని ఏబీఎం చర్చిలో పాస్టర్ ప్రసంగి, సీఎస్‌ఐ చర్చిలో పాస్టర్ ప్రభు ఏసు సందేశాన్ని వివరించారు. బైబిల్ సారాంశాన్ని గీతాలాపన చేశారు. చిన్నారులు ఆట, పాటలతో అలరించారు.

● **సి.బెళగల్:** ఏసు ప్రభు లోక రక్షకుడని సి.బెళగల్



సి.బెళగల్ ఏబీఎం చర్చిలో..

అమెరికన్ బాప్తిజమ్ మెమోరియల్ (ఏబీఎం) చర్చి సంఘకాపరి సొలోమోన్ అన్నారు. ఇనగండ్ల చర్చిలో ప్రత్యేక ప్రార్థనల్లో పాస్టర్ సీమోన్ బైబుల్‌పై బోధనలు చేశారు. మండలం పరిధిలోని పోలకల్ గ్రామంలోని పెనుయేలు ప్రార్థన మందిరంలో పాస్టర్ జాన్ మోజేష్ ఆధ్వర్యంలో ప్రార్థనలు జరిగాయి.



చెట్లమల్లాపురంలో దైవ సందేశం ఇస్తున్న పాస్టర్



గూడూరు: ప్రార్థనల్లో పాల్గొన్న క్రైస్తవులు

● **గూడూరు:** పట్టణంలోని ఏబీఎం, సీఎస్‌ఐ చర్చిలను అందంగా ముస్తాబు చేశారు. ఏబీఎం చర్చిలో ఎం.రవికుమార్ ఆధ్వర్యంలో ప్రార్థనలు నిర్వహించారు. సంఘ పెద్దలు రాజశేఖర్, కిషోర్, సుందరరాజు, దాసు, దేవదానం, దేవరాజు, సుంకన్న తదితరులు పాల్గొన్నారు.

వేకువజాము నుంచే ప్రార్థనలు



పాణ్యం: దైవ సందేశాన్ని ఇస్తున్న పాస్టర్ బుర్రయ్య

పాణ్యం: మండలంలోని పలు చర్చిల్లో సోమవారం వేకువజాము నుంచే క్రైస్తవులు ప్రార్థనలు చేశారు. పాస్టర్లు కేక్ కట్ చేసి దైవ సందేశాన్ని వినిపించారు. పాణ్యంలోని ఇంటింటి సువార్త చర్చిలో పాస్టర్ బుర్రయ్య ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి ప్రార్థనలు చేశారు. ఆలమూరు సీఎస్‌ఐ చర్చిలో క్రీస్తు జననం



ఆలమూరు సీఎస్‌ఐ చర్చిలో..

తెలిపేలా పసువుల పాక ఏర్పాటు చేశారు. లోక రక్షకుడు ప్రజలను కాపాడేందుకు లోకానికి వచ్చినట్లు పాస్టర్లు తమ సందేశాన్ని వినిపించారు. ప్రతి ఒక్కరూ సేవాభావంతో మెలగాలని పిలుపునిచ్చారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

కోడుమూరు రూరల్: క్రిస్మస్‌ను పురస్కరించుకుని పట్టణంలోని ఏబీఎం చర్చిలో క్రైస్తవులు సోమవారం ప్రార్థనలు చేశారు. చర్చి ఫాస్టర్ రెవరెండ్ సామెల్ క్రీస్తు బోధనలు వినిపించారు. ప్రజలంతా సన్మార్గంలో నడవాలన్నారు. అలాగే మండలంలోని పులకుర్తి, వర్కూరు, లద్దగిరి, గోరంట్ల, క్రిష్ణాపురం, ప్యాలకుర్తి, అమడగుంట్ల, అనుగొండ, కల్లపరి గ్రామాల్లో క్రిస్మస్‌ను ఘనంగా జరుపుకున్నారు.



ఇనగండ్లలో..

టీడీపీ బరితెగించి తప్పుడు ప్రచారం

- నుగాలిమెట్టలో నీటి సమస్య ఉందటూ దుష్ప్రచారం
- మోటార్ల మరమ్మతుల కోసం భిక్షాటన చేస్తున్నట్లు డ్రామాలు, పచ్చ పత్రికల్లో ప్రచురణ
- రెండు మోటార్ల ద్వారా నీటిని పుష్కలంగా అందిస్తున్నా దురుద్దేశంతో కుట్రలు
- చివరికి అబాసుపాలైన టీడీపీ నాయకులు



బస్టాండ్ వెనక ఉన్న బోరుకు మరమ్మతులు చేసిన దృశ్యం



సోమవారం ఉదయం ఓహెచ్ఆర్ ట్యాంక్‌కు చేరిన నీరు

పాణ్యం: మండలంలో టీడీపీ దురాగతాలు తారాస్థాయికి చేరాయి. లేని సమస్యను సృష్టించి ప్రభుత్వానికి ఆపాదిస్తూ పచ్చ పత్రికల్లో ప్రచురించుకొని పైశాచిక ఆనందం పొందడం వారికి అలవాటుగా మారింది. ఇందులో భాగంగా పాణ్యం మండలం సుగాలిమెట్ట గ్రామంలో టీడీపీ నాయకులు తిరుపాల్‌నాయక్ ఓ కపట నాటకం అల్లారు. ఇందుకు పచ్చ పత్రికలు తోడై విష ప్రచారానికి పూనుకున్నారు. గ్రామంలో నీటి సమస్య ఉందటూ ప్రభుత్వం పంచాయతీలకు నిధులు ఇవ్వకపోవడంతో మరమ్మతుల కోసం భిక్షాటన చేస్తున్నట్లు డ్రామాలు చేశారు. ఈ దృశ్యాలను ఫొటోలు, వీడియోలు తీసి తమ గ్రూపులలో, సోషల్ మీడియాలో వైరల్ చేశారు. అంతేకాక పచ్చ పత్రికల్లో ప్రచురించుకున్నారు. అంతటితో ఆగకుండా టీడీపీతో పాటు, వైఎస్సార్‌సీపీ నాయకులు కూడా ఈ భిక్షాటనలో పాల్గొన్నారని తప్పుడు ప్రచారంతో హల్‌చల్ చేశారు.

ఇదీ నిజం

సుగాలిమెట్ట గ్రామ పంచాయతీలో 300కుటుంబాలు ఉండగా 760 మందికిపైగా జనాభా ఉన్నారు. గ్రామంలో పశుపోషణ అధికం. గతంలో సమీపంలోని జంబులాపరమేశ్వరి ఆలయం వద్ద నుంచి గ్రామానికి నీటి సరఫరా ఉండేది. కొత్తగా గ్రామ పంచాయతీ ఏర్పడిన తర్వాత భవిష్యత్తులో నీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి చొరవ తీసుకొని గ్రామంలోని బస్టాండ్ వెనుక మరో బోరు వేయించారు. ప్రస్తుతం గ్రామానికి రెండు బోర్ల ద్వారా పుష్కలంగా నీరు అందుతోంది. బస్టాండ్ వెనుక ఉన్న బోరు వైర్లు కాలిపోవడంతో సర్పంచ్ దేవీబాయి స్పందించి మరమ్మతు పనులు చేయించి సోమవారం ఉదయానికి ఓహెచ్ఆర్ ట్యాంక్‌కు నీరు ఎక్కించారు. ఈ క్రమంలో జంబులా పపరమేశ్వరి ఆలయం వద్ద ఉన్న బోరు నుంచి నీటి సరఫరా జరుగుతోంది. ఎక్కడా నీటి ఇబ్బంది లేదు. దీనికి తోడు నీటి సమస్య తలెత్తకూడదనే ఉద్దేశంతో ఇటీవలనే ఎంపీపీ నిధులు రూ.లక్ష కేటాయించి ఇతర పనులు చేపట్టారు. ఎక్కడా నిధుల సమస్య లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుంటున్నారు. అయినా ప్రతిపక్ష నాయకులు ఏదీ దొరక్క ఇలాంటి తప్పుడు ప్రచారం వైరల్ చేసి శునకానందం పొందుతున్నారు. గతంలో పాణ్యం గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న సమయంలో గ్రామస్తులు పలుమార్లు పంచాయతీ కార్యాలయం ముందు నీటి బిందెలతో ధర్నా చేసినా అప్పటి టీడీపీ ప్రభుత్వం కన్నెత్తి చూడకపోగా సమస్య పరిష్కారానికి పైసా కూడా విదల్చలేదు. ఉన్న ఒక బోరుతో వచ్చే నీరు చాలక ప్రజలు ఇబ్బందులు పడినా ఏ మాత్రం పట్టించుకోలేదు. అయితే కొత్త పంచాయతీలో మౌలిక సదుపాయాల కొరత ఉండరాదనే ఉద్దేశంతో ప్రభుత్వం అన్ని విధాలా సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ టీడీపీ నాయకులు ఇలాంటి బురదజల్లె ప్రయత్నాలు చేయడంపై స్థానిక ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు లక్ష్మీనాయక్ కూడా భిక్షాటనలో పాల్గొన్నారంటూ ప్రచారం చేశారు. వాస్తవానికి ఆయన పాల్గొనకపోయినా తప్పుడు సంకేతాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలనే దురుద్దేశంతో టీడీపీ నాయకులు చిల్లర రాజకీయం చేయడాన్ని ప్రజలు ఆసహ్యించుకుంటున్నారు.

నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

గిరిజన తండాలో నీటి సమస్య తలెత్తకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నాం. బస్టాండ్ వెనుక ఉన్న బోరు వైర్లు కాలిపోయిన వెంటనే మరో బోరు నుంచి కనెక్షన్ ఇచ్చాం. నీటి సరఫరా ఆపకూడదనే ఉద్దేశంతో మరమ్మతులు చేసి రెండవ బోరు నుంచి పంపింగ్ ప్రారంభించాం. ఎక్కడా గ్రామానికి నీటి సరఫరా ఆగలేదు. నిజానిజాలు తెలుసుకోకుండా కొన్ని పత్రికల్లో అవాస్తవాలు ప్రచురించారు. – మధుశేఖర్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ

కుట్రపూరితంగానే టీడీపీ డ్రామా

దురుద్దేశంతోనే టీడీపీ నాయకులు ఇలాంటి పనికి పూనుకున్నారు. గత ప్రభుత్వంలో నీటి కోసం చేసిన ఆందోళనలు అన్నీ ఇన్నీ కావు. కొత్తగా ఏర్పడిన పంచాయతీకి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ముందస్తు ఆలోచనలతో రెండవ బోరు వేయించారు. ఈ రెండు బోర్ల ద్వారా పుష్కలంగా నీటిని అందిస్తున్నాం. నీటి సరఫరాకు పంచాయతీలో నిధులు పుష్కలంగా ఉన్నాయి. టీడీపీ నాయకులే తప్పుడు సమస్యను సృష్టించి ప్రభుత్వానికి ఆపాదిస్తూ పత్రికల్లో రాయించుకోవడం సిగ్గుచేటు. – దేవీబాయి, సర్పంచ్, సుగాలిమెట్ట

అట్టహాసంగా బండలాగుడు పోటీలు



బండను లాగుతున్న ఎద్దులు

ఓర్వకల్లు: మండల కేంద్రమైన ఓర్వకల్లు గ్రామంలో రాష్ట్ర స్థాయి ఎద్దుల బండ లాగుడు పోటీలను అట్టహాసంగా నిర్వహించారు. సోమవారం క్రిస్మస్ పండుగ సందర్భంగా స్థానిక ఏబీఎం చర్చి సంఘస్తులు చేట్ల వందనాలు ఆధ్వర్యంలో జరిగిన పోటీల్లో మొత్తం 15 జతల ఎద్దు పాల్గొన్నాయి. కోడుమూరు మండలం, వెంకటగిరి గ్రామానికి చెందిన బీఎల్‌కే ఎద్లు నిర్ణీత సమయానికి 4996 అడుగుల దూరం లాగి మొదటి బహుమతి రూ.35 వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే కర్నూలు మండలం, పంచలింగాలకు చెందిన బైరుపోగు సంకన్న వృషభాలు 4800 అడుగులు లాగి రెండో బహుమతి రూ.30వేలు దక్కించుకున్నాయి. కర్నూలు మండలం, పి.రుద్రవరం గ్రామానికి చెందిన రాముడు, ఎల్లగౌడు వృషభాలు 4671 అడుగులు లాగి మూడో బహుమతి రూ.20 వేలు సాధించగా, నాగర్‌కర్నూలు జిల్లా, కొల్లాపురానికి చెందిన మాస్టర్ సాత్విక్ ఎద్దులు 4449 అడుగులు లాగి నాల్గో బహుమతి రూ.10 వేలను గెలుచుకున్నాయి. బండిఆత్మకూరు మండలం, సోమయాజులపల్లె గ్రామానికి చెందిన నరసయ్యయాదవ్ వృషభాలు 4319 అడుగులు లాగి ఐదో బహుమతి రూ.6016 సాధించగా, కృష్ణగిరి మండలం, ఆలంకొండ గ్రామానికి చెందిన మునిరంగడు, కర్నూలు మండలం, గొందిమల్లకు చెందిన షేక్షావలి(విడిజత) ఎద్దులు 4200 అడుగులు లాగి ఆరో బహుమతి రూ.4016 సాధించినట్లు నిర్వాహకులు వందనాలు తెలిపారు. పోటీలను తిలకించేందుకు చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రజలు తరలిరావడంతో సందడి వాతావరణం నెలకొంది. జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు, రామనాయుడు, శంకర్‌రెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, గోవిందర్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

● **నేడు గొందిపర్లలో ఎమ్మెల్యే పర్యటన**

కర్నూలు సిటీ: కర్నూలు రూరల్ మండల పరిధిలోని గొందిపర్ల గ్రామంలో కోడుమూరు ఎమ్మెల్యే జరదొడ్డి సుధాకర్ మంగళవారం పర్యటించనున్నారు. గ్రామ సమీపంలోని తుంగభద్ర నదిలో మత్స్యకారుల కోసం సుమారు రూ.18 లక్షల విలువ చేసే చేప పిల్లలను వదలనున్నారు.

● **కొనసాగుతున్న అంగన్‌వాడీల నిరసన**

పాణ్యం: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు చేపట్టిన సమ్మె సోమవారం 14వ రోజుకు చేరుకుంది. క్రిస్మస్ సందర్భంగా ఎంపీడీఓ కార్యాలయం ఎదురుగా ఉన్న శిబిరంలో కేక్ కట్ చేశారు. తమకు కనీస వేతనాలు చెల్లించాలని.. ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు | వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు | శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

కోడుమూరు, పాణ్యం

70750 09147 (కోడుమూరు),
70750 09185 (పాణ్యం)

Office mail : sakshiknladvt@gmail.com